"పార్వతీ! ఏం చేస్తాం ... ఏడ్చి మాత్రం ఏం లాభం చెప్పు! నా తల్లి కదూ!" పినతల్లి ఓదార్చు.

"పారూ! నీవు చాలా ధైర్యం గలదానివి. నీకు చెప్పాల్సిన అవసరం లేదు. దుఃఖాన్ని దిగమింగుకుని పిల్లలకోసం బతకాలిక!" స్నేహితురాలు రమ ధైర్యం చెప్పింది.

'అవును, కరెక్టే! పిల్లలకోసం బతకాలి, తప్పదు!' పార్వతి ఒక్క క్షణం ఏడుపు ఆపి చుట్టూ చూసింది. బంధువులు, స్నేహితులు.

"భగవంతుడు ఓర్వలేకపోయాడమ్మా! పండంటి సంసారం ... చిన్నప్పుడే నీ కీ అవస్థ రాసిపెట్టాడమ్మా!" అంటూ ముక్కు చీదేస్తోంది పిన్నత్తగారు.

భర్త పోయిన దుఃఖం, పిల్లల జీవితం ... ఇకముందు తను ఒంటరా?

బాబుకు పన్నెండేళ్లు, పాపాయికి ఏడేళ్లు. వాళ్లెప్పుడు పెరిగి పెద్దవాళ్లై గట్టెక్కేది? "భగవాన్! ఎందుకు నాకీ శిక్ష వేశావు?" బావురుమంది పార్వతి.

"ఏడవద్దని ఎలా చెప్పనే! నీవు బతికున్నంత కాలం, నీ కీ బాధ ఉండేదే! ఇంత త్వరగా వాడికి వందేళ్లు నిండుతాయనుకోలేదు!" అంటూ ఏడుస్తోంది పార్వతి ఆడపడుచు.

ముందర గదిలో చాలామంది బంధువులు రకరకాలుగా పార్వతి భర్త మంచితనం గురించీ, పార్వతి దురదృష్టం గురించీ మాట్లాడుకుంటున్నారు పదమూడవ రోజు.

కర్మ చేయాలి. ఆ ఏర్పాట్ల గురించి పార్వతి మేనమామ పురోహితుడితో మాట్లాడుతున్నాడు.

వెనక గదిలో ఓ మూల దిగులుగా, ఊపిరాడని ఆలోచనలతో, తడి ఆరని కళ్లతో బరువెక్కిన మనసుతో పార్వతి. 'హార్ట్ ఎటాక్ తనకు రాకూడదా! ఆయన బతికి ఉండకూడదా?

"అమ్మా! నువ్వేడిస్తే నాకూ ఏడుపొస్తోందమ్మా! డాడీ ఇంక రారా అమ్మా?" అంటూ పార్వతిని పట్టుకు కుదిపేస్తోంది పాప.

పార్వతి ఆడపడుచు, పినతల్లి ఏదో మాట్లాడుకుంటున్నారు. మంగళసూత్రం, మట్టెలు తీయాలట. బాబు బయటనుంచి తిరిగి వచ్చేలోగా ఆ కార్యక్రమం పూర్తవ్వాలట.

పార్వతి వింటున్నది. గుండె పగులుతుందేమో ననిపించింది. కానీ అలా జరగలేదు. బండబారిపోయింది. నోరు పెగలలేదు. భర్త చనిపోయిన దగ్గరనుంచీ ఈ పదమూడు రోజులూ తాననుభవించిన నరకం కళ్లముందు కదిలింది.

ఏమిటో ... పూలు, బొట్టూ విధిగా రోజూ పెట్టుకోమనేవారు. భర్త ఆత్మ ఇక్కడే ఉంటుందట పుస్తకాల్నుంచి చదివిన పెద్దలు చెవుతున్నారు. ఆత్మ ఎక్కడో ఒకచోట తిరుగుతూనే ఉంటుందిగా! పూలు, బొట్టు తర్వాత మాత్రం ఎందుకు ఉండకూడదు?

అయినా భర్త పోవడానికి, పూలూ, బొట్టూ తీయడానికి సంబంధం ఏమిటి?

"తీసేయడం అనేది సంప్రదాయం. అందరికీ మంచిది. ఏమిటో ... అరవై ఏళ్లు దాటినవాళ్లు ఇందరుండగా ఈ దురదృష్టం నీకే పట్టాలా?"

పార్వతికి ఈ మాటలు వినీ వినీ తల మొద్దుబారిపోయింది. ఏమిటో యాంత్రికంగా మసలుతోంది. భవిష్యత్తు ఏమిటి? ఆయన లేని బతుకు ఎంత దుర్భరం? ఎన్నిసార్లు తను ఏమనుకుంది? ఆయనకంటే తను ముందు వెళ్లిపోవాలి. ఆ మాటే ఓసారి భర్తతో అంది. •





# ఈ ప్రశ్నకు సమాధానం...?

## దుర్గా భాస్కర్

"వద్దు పారూ! అంత శిక్ష నేను భరించలేను. భర్తలేకుండా భార్య బతకటంకంటే, భార్యలేని మగవాడి బతుకు భరించలేనిది. ప్లీజ్, అలా అనకు!" అంటూ బాధగా చూశారు.

"ఫరవాలేదండీ ...! ఆడపిల్లను కన్నాంగా, పాపకు మీరంటే ప్రేమ. నేను లేకపోయినా మీకు చేసిపెట్టడానికి, చూసుకోవడానికి ఓ ఆడపిల్లను కన్నాను, చూశారా! మీ గురించి బెంగ లేకుండా వెళ్లిపోగలను!" అంటూ గర్వంగా నవ్వేది. కానీ అనుకున్నవి జరగవు. అనుకోనివి జరుగుతాయి.

అదే జీవితం.ఆయన మాటే నెగ్గింది. కానీ ఇంత ఘోరంగా ... నలభై ఏళ్లకే జీవితం ముగిసిపోతుందనుకోలేదు. ఆలస్యంగానైనా ఆడపిల్ల పుట్టిందని ఎంత మురిసిపోయారు? పాప చాలా దిగులుపెట్టుకుంది. వాళ్ల డాడీని పడుకోబెట్టిన చోటు చూపించి ఏడుస్తోంది.

బాబుకు నోట మాట రావడంలేదు. "నిజంగా డాడీ చనిపోయారా? నమ్మలేకపోతున్నానమ్మా! ఉన్నట్టుండి ... ఇలా అకస్మాత్తుగా ...?" దుఃఖంతో మాట్లాడలేకపోయాడు.

కారణం ఏదైనా భర్తను కోల్పోయిన పార్వతి, తండ్రిని పోగొట్టుకుని పిల్లలు ఏడుస్తూ, ఆలోచిస్తూ ఉన్నట్టుండి భోరుమంటున్నారు. చూసేవాళ్లందరికీ భగవంతుడికి ఇంత నిర్దయా అని అనిపించక మానదు. నిండా ముప్పై అయిదేళ్లు లేని పార్వతికి ముందు ఎంత జీవితం ఉంది? ఎలా గడుస్తుంది? ఎలాగో గడుస్తుంది. కానీ తానే తల్లి, తానే తండ్రి రెండు బాధ్యతలూ తానే వహించాలి.

పార్వతి ఆఫీసులో పనిచేసేవాళ్లు చాలామంది పార్వతిని చూడటానికి వచ్చారు. వస్తూనే ఉన్నారు. అందరూ చెప్పే మాట ఒకటే ఆయన ప్రతిరూపాలైన పిల్లల్ని పెంచి పెద్ద చేయాలి కనుక ధైర్యంగా ఉండాలి. పైగా పెళ్లికాని ఆడపడుచు భార్గవి బాధ్యత కూడా తనది. భర్తకు ఆ అమ్మాయంటే తగని ప్రేమ.

"వదిన అందరి వదినల్లాంటిది కాదన్నయ్యా! నువ్వెంతో నాకు, వదినా అంతే!" అంటే, పార్వతివైపు మెచ్చుకోలుగా చూస్తూ తృప్తిగా చిరునవ్వు నవ్వేవాడు.

భార్గవి ఇప్పుడే కాలేజీలో చేరింది. అత్తమామలు కాలం చేశారు. పెద్ద ఆడపడుచు పెళ్లయిపోయింది. వాళ్ల బతుకు వాళ్లు బతుకుతున్నారు. పెళ్లయ్యాక మరింక పుట్టింటి సంగతి పట్టించుకోకూడదు అనే పెద్దవాళ్లలో మరీ పెద్దవాడు ఆమె భర్త. ఇలాంటి పరిస్థితిలో ఇక భార్గవిని కూడా తనే చూసుకోవాలి. తప్పదు.

ఎలా ...? ఎలా గడిచేది? ఎప్పటికి గట్టెక్కేది? .... ఆలోచనలతో తల వేడెక్కి కళ్లు తిరుగుతున్నాయి. నేలమీద అలాగే ఒంగి కన్నీరు కారుస్తోంది. మధ్య మధ్యలో భర్త ఫొటో చూస్తూ, "ఎందుకు నన్ను విడిచి వెళ్లారు?" అని ప్రశ్నిస్తున్నట్లు చూస్తోంది.

"మిసెస్ ప్రసాద్ ఎక్కడ?" ఆఫీసులో తనతో పనిచేసే ఉద్యోగి రమణ.

"అదిగో, ఆ గదిలో ..." ఎవరో చెప్తున్నారు.

లేని ఓపిక తెచ్చుకుని లేచి కూర్చుంది. కళ్లు తిరుగుతున్నాయి. వాతావరణం శోకమయంగా, భారంగా ఉన్నా, పిన్నత్తగారూ, పినతల్లీ ఏదో హడావుడి పడుతున్నారు. "త్వరగా కానీయండి ...!" అంటున్నారెవరో.

"మేడమ్! నిన్నే తెలిసింది. సెలవులో ఉన్నా. సడెన్‌గా ఎలా జరిగింది? వెరీ అన్‌ఫార్చునేట్ ...

నా సంగతి మీకు తెలుసో, తెలియదో! నా భార్య పోయేటప్పుడు మా అబ్బాయిలిద్దరికీ ఆరేళ్లు, నాలుగేళ్లు. నా కళ్లెదుట ఉన్నట్టుండి ఇలాగే మీవారిలాగే సడెన్‌గా పోయింది. కానీ ... ఏం చెయ్యగలం? అన్నీ నేనే అయి వాళ్లని పెంచాను. ఇప్పుడు పెద్దవాడికి ఇరవై అయిదు, చిన్నవాడికి ఇరవై రెండేళ్లు. ఇద్దరూ లైఫ్‌లో బాగా సెటిల్ అయ్యారు. నా గురించి చెప్పుకోడానికి కాదు ... మీరు ధైర్యం తెచ్చుకోవడానికి చెప్తున్నాను. ప్లీజ్, అలా ఏడవకండి. పిల్లలు అధైర్య పడిపోతారు." స్వానుభవం గుర్తు తెచ్చుకుంటూ ఓదార్చి, ధైర్యం చెప్పి వెళ్లిపోయాడు రమణ.

"పార్వతిని రమ్మనమ్మా!"

జరగబోయేదేమిటో గ్రహించిన పార్వతి మంగళసూత్రాలను గుప్పెట్లో పెట్టుకుని బావురుమంది. పాప అమ్మను కావలించుకుని "అమ్మా! అమ్మా!" అంటూ రోదిస్తోంది.

బాబు పరుగెత్తుకొచ్చాడు. "అమ్మా! ఏడవద్దమ్మా ...! అమ్మా... అమ్మా...!" అంటూ వాడూ కన్నీళ్లు కారుస్తూనే ఉన్నాడు. ఇంతలో ఎవరో వచ్చి ఆ అబ్బాయిని పిల్చుకు వెళ్లారు.

"ఎందుకు మామయ్యా, అమ్మని ఏడిపిస్తున్నారు? మీరంతా మా అమ్మని ఏడిపించడానికి వచ్చారా? అయితే వెళ్లిపొండి!" ఉద్రేకంగా అరుస్తున్నాడు.

## రంగస్థలం తమాషాలు

రంగస్థలం మీద నటించే నటులకు ఒక్కోసారి అనుకోని సంఘటనలు జరిగి ఇరుకున పడేస్తాయి. వాటిని సమయస్ఫూర్తితో ఎదుర్కొన్నవారున్నారు, అభాసుపాలైన వారూ వున్నారు. ఇలాంటి సంఘటనలు ప్రేక్షకులకు వినోదం కలిగిస్తుంటాయి. మచ్చుకు కొన్ని:

పిస్తోలు పోయి కత్తి వచ్చె ఢాం!

హీరో పిస్తోలుతో విలన్‌ను కాల్చబోతాడు. ఆ సమయంలో తెర వెనుక నుంచి టపాకాయ శబ్దం చేసి పిస్తోలు కాల్చిన ఎఫెక్ట్ కలుగజేయాలి. కాని



టపాకాయ పేలకపోవడం వల్ల శబ్దం రాదు. సమయస్ఫూర్తిగా హీరో "నిన్ను పిస్తోలుతో కాల్చుట కన్న కత్తితో పొడుచుట ఉత్తమము" అని నడుముకున్న కత్తిని తీసి పొడవబోతాడు. ఇంతలో టపాకాయ "ఢాం!" అని తెర వెనుక నుంచి పేలుతుంది. ప్రేక్షకులు గొల్లున నవ్వుతారు.

కె. ఆర్.

"బాబూ ...! నే చెప్తాగా ... రా, రా!" అంటూ బాబును బయటకు తీసుకువెళ్లారు.

పార్వతి చెల్లెలు అక్కకు కలిగిన కష్టానికి తట్టుకోలేక, అక్కను చూడలేక స్పృహ తప్పి పడిపోయింది. ఎవరో నీళ్లు చల్లారు. కళ్లు తెరిచింది. "ఎందుకండీ మా అక్కకివన్నీ చెస్తారు?" అంటూ పార్వతిని కావలించుకుని ఏడ్చింది.

మెల్లిగా చెల్లిని విడిపించుకుని పెద్దలు చెప్పినట్లల్లా యాంత్రికంగా చేసింది. వెక్కివెక్కి ఏడ్చింది. ఏ పినతల్లికీ జాలి కలగలేదు. ఆడపడుచు ఏమీ ఎరగనట్లు మౌనం వహించింది. పిన్నత్తగారు సలహాలిచ్చారు. చెల్లెలు, పాప, బాబు ఏడుపులతో ఇల్లు మార్మోగిపోయింది. పార్వతికి ఏం జరుగుతోందో తెలియడంలేదు. సగం స్పృహలో ఉన్నట్టుంది. దిక్కు లేనిదైనట్టు బేలతనం ఆవహించింది. భోరున ఏడ్చింది. తను కూడా చచ్చిపోతుందేమో అనిపించింది. తనలో ఉన్న శక్తినంతా ఎవరో పీల్చేస్తున్నట్టుగా అనిపించింది. కళ్లముందు చీకటి....

"నాకేదైనా అయితే పిల్లల్ని చూసుకుంటావా, చిన్నూ!" అంటూ చెల్లిని కావలించుకుని ఘొల్లుమంది.

మా మరదలు నన్ను కావలించుకుని వదిననెందుకు ఏడిపిస్తున్నారు? ఏమండీ ... వద్దని చెప్పండి ... మిమ్మల్నే ...! ఏడ్చింది.


కోరా రంగు చీర కట్టుకోమన్నారు. బొట్టు పొడుగ్గా పెట్టుకోమన్నారు. హాల్లోకి రమ్మన్నారు. "ఫరవాలేదండీ! ఆ గదిలో ఉండనివ్వండి.

యాంత్రికంగా అన్నీ జరిగిపోయాయి. ఎక్కడి వాళ్లక్కడ వెళ్లిపోయారు. భారంగా రోజులు గడుస్తున్నాయి.

"మా అత్తింటివారిని గానీ, నా పేరునుగానీ మార్చమనరేం? మట్టెలు, మంగళసూత్రం తప్ప గుర్తులు ఏమీ లేవా? నీకంటే, పాపాయికంటే వేరే గుర్తులు ఏం కావాలి? మీ రిద్దరినీ పెంచే బాధ్యత నాకే ఎందుకు వదిలేశారు. మామయ్యా, బామ్మ, అత్తయ్యా, అమ్మమ్మ ... వీళ్లంతా? పిల్లల బాధ్యత నీకుందిగా దుఃఖాన్ని మింగేయ్యాలి అంటారేమిటి? నా మట్టెలు, గాజులు తీసుకున్నవాళ్లు మీ నాన్న బాధ్యతనీ, బరువుల్నీ, అప్పుల్నీ ఎందుకు తీసుకోరు? అసలు వీళ్లంతా ఎందుకిలా చేస్తున్నారు?"

"అమ్మా! నువ్విలా ఆలోచిస్తే మే మిద్దరం ఏమైపోవాలి?"

"ఊరికే అలా అన్నా, నాన్నా! ... మీ రిద్దరూ నాకు కావాలి. డాడీ గుర్తులు. నాకు సంతోషాన్నిచ్చి



ముందుకు నడిపించే చిహ్నాలు మీరే!"

బాబు అమ్మ చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. అమ్మ కన్నీళ్లతో చెయ్యి తడిసిపోయింది.

"ఇంట్లో ఉంటే మరీ పిచ్చెక్కుతుంది, ఆఫీసుకు వెళ్లిపో మమ్మీ!" బాబు చిన్నవాడైనా నన్ను ఓదార్చి నాకు ధైర్యం చెప్పాడు.

***

వారి చదువు, బాధ్యత ... ఇలా కొన్ని సంవత్సరాలు గడిచాయి.

పిల్లలు మరికాస్త ఎదిగారు. జీవితం పట్ల, మనుషులపట్ల వారి అవగాహన పెరిగింది కనుక ఫరవాలేదు.

ఆ రోజు రాత్రి పన్నెండు గంటలైనా బాబు నిద్రపోలేదు. ఎందుకో నా దగ్గరే కూర్చుని మాట్లాడుతున్నాడు.

"చాలా రోజులైంది కదమ్మా, మనం ఇలా కూర్చుని విశ్రాంతిగా మాట్లాడుకుని!"

"ఇప్పుడు మాత్రం ఏమైంది?"

అర్ధరాత్రి తప్ప వీలవలేదు. వాడు చదువుతోనూ, నేను నా బాధ్యతలతోనూ సతమతమవడంతో ఓ రోజు పని పూర్తయ్యేలోగానే మరునాడు పొద్దుపొడుస్తోంది. ఎన్నో విషయాలు మామధ్య దొర్లుతున్నాయి. వాడి స్నేహితులు, కాలేజీ, మా ఆఫీసువాళ్ల గురించి, బంధువుల గురించి, భవిష్యత్తు గురించి ... ఎందుకో నాకు నా బాధ మళ్లీ గుర్తువచ్చింది.

"కన్నా! డాడీ పోయాక డాడీ ఇచ్చిన గుర్తులు తీసెయ్యాలన్నారే ...."

"ఏమిటి మమ్మీ! ఎవరేమంటే నీకేం? నువ్వు లెక్కచేయకు. నువ్వు మాకు ఎప్పటిలాగే ఉండాలి. ఉంటున్నావు. ఎవరేమనుకుంటే మనకేం?"

"అది కాదురా, బొట్టు అంతా పెట్టుకుంటున్నారీ రోజుల్లో. దానిదేముంది?"

"మరేమిటి?"

"నా గురించి. నా కోసం అని కాకుండా మామూలుగా అడుగుతున్నా ... డాడీ వల్ల వచ్చినవన్నీ తీసెయ్యాలంటే ... డాడీ చేసిన అప్పులు నన్నెందుకు తీర్చమన్నారు? డాడీ వల్ల నా పేరు మార్చారు కదా! మిసెస్ పార్వతీ కుమార్ అని. పెళ్లికి ముందు పార్వతీ దేవి. మళ్లీ పార్వతీదేవిగా మార్చరెందుకని?

అసలు వాళ్లు చెప్పినట్లల్లా నేను ఎందుకు చేశాను.... పరిస్థితుల్నిబట్టి...

కొన్నాళ్లకి పిల్లలే స్నేహితులు, వాళ్లతోనే మన కష్టసుఖాల్ని చర్చించవచ్చు అనుకున్నరోజులున్నాయి. ఒక్కోసారి వాళ్ల సలహా మనకి అవసరం అవ్వొచ్చు. ఆ సలహా సరైనది కూడా కావచ్చు. అలాగే నా పిల్లలిద్దరూ "అమ్మా! నీకు మేమున్నాం!" అంటూ నాకే ధైర్యం చెప్పడం, "అమ్మా! ఇంత చదువుకున్నదానివి .. ఇంత పెద్ద ఉద్యోగంలో ఉన్నదానివి ... అల్పమైన విషయాల గురించి మాట్లాడటం, ఆలోచించడం బాగాలేదు. నీకెలా సంతోషంగా ఉంటుందో అలా చెయ్యి. ఎవరినీ లెక్క చేయనక్కరలేదు. నువ్వే చెప్పు..." బాబు ఇంకా మాట్లాడుతూనే ఉన్నాడు.

అప్పటికీ ఇప్పటికీ కూడా నా ప్రశ్నకి సమాధానం ఇంకా దొరకలేదు.

బాబు మట్టెలు కాదా?

పావ మంగళసూత్రం కాదా?

మూర్ఖులు, స్వార్థపరులు, ఛాందసులు, గంగిరెద్దులు ... నిర్ణయాలు, మానవత్వం లేనివాళ్లు ఆచారం పేరిట తోటి స్త్రీలను బాధించే అమ్మలక్కలు ... అలాంటి అమ్మలక్కలలాంటి కొందరు 'పురుషపుంగవులు' ... ఈ ప్రశ్నకు సమాధానం చెప్పగలరా ....?

ఇంకా అడుగుతూనే ఉన్నా ... చెప్పండి!

■

## రంగస్థలం తమాషాలు

### అది కాదు, ఇది!

అది ప్రహ్లాద నాటకంలో చివరి సీను. నరసింహావతారం వేసిన వ్యక్తి ఒక స్తంభం వెనుక దాక్కుని వుంటాడు. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడితో "ఓరీ! నీ హరిని ఈ స్తంభమున చూపగలవా?" అంటూ పొరపాటున ఇంకో స్తంభం వైపు చూపుతాడు. ప్రహ్లాదుడు ఇది గమనించి "ఈ స్తంభంలో ఏమో కాని, ఆ స్తంభంలో చూపగలను" అంటూ నరసింహావతారం దాక్కుని వున్న స్తంభం వైపు చూపాడు. ప్రేక్షకులు నవ్వాపుకోలేకపోయారు!



ఇంకో నాటకంలో అదో దర్బారు సీను. రాజుగారు సింహాసనం మీద కూర్చుని వున్నాడు.

"ఓరీ! ఎవడురా అక్కడ?" అని చప్పట్లు కొట్టాడు.

ఎక్కడి నుంచో ఓ కుక్క వచ్చి స్టేజీకి అడ్డంగా పరుగెట్టింది.

ఇక చూసుకోండి, ఆ రాజుగారి ముఖం! జనం గోల!!

- కె. ఆర్.

